క్లుప్తంగా

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



జల్లికొమ్మరలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ఎంతో సున్నితమైన కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సంతోష్‌నాయుడు అన్నారు. సోమవారం గణపవరం మండలం వెలగపల్లి గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 52 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సవలం సత్యనారాయణ మృతి తీరని లోటు



సవలం సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దస్తావేజు లేఖర్లు

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్ప మాలధారుడు, దస్తావేజు లేఖర్ల సహాయకుడు సవలం సత్యనారాయణ (43) సేవలు మరవలేనివని పలువరు వక్తలు అన్నారు. భీమడోలు జాతీయ రహదారి వద్ద ఈనెల 11న రాత్రి ఓ కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో మాలధారుడు సవలం సత్యనారాయణ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో భీమడోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మృతికి సూచికంగా సోమవారం సంతాపం వ్యక్తం చేసారు. సవలం సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యనారాయణ అకాల మృతి మా సంఘానికి తీరని లోటని పలువురు అన్నారు. ఆ కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. తొలుత దస్తావేజు లేఖర్లు సంతాప సూచికంగా విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షుడు వెజ్జు నాగేశ్వరరావు, ప్రతినిధులు నండూరి శ్రీరామ్, బాలనాగు సుబ్బారావు, వర్ధినీడి మురళీ, శీలకుర్తి రాము నివాళుర్పించారు.

ఘనంగా పెద్దింట్లమ్మ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో పెద్దింట్లమ్మ వారు

దెందులూరు: దెందులూరులోని పెద్దింట్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి 44వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, అమ్మవారికి వార్షికోత్సవ వేడుకల సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ఆదివారం రాత్రి అమ్మవారి ప్రతిమను ట్రాక్టర్‌పై ఊరేగించారు. మంగళవారం అమ్మవారి ఆలయ అవరణలో మహా అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఏలూరు టౌన్: వాతావరణంలో వస్తోన్న మార్పుల నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ... వైద్యుల సూచనలు పాటించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు తెలిపారు. హెచ్3ఎన్2 ఇన్ఫ్లుయెంజా వైరస్ వ్యాప్తిని, సాధారణ వైరల్ ఫీవర్స్‌ను అరికట్టేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏలూరు వన్‌టౌన్ పడమర వీధి, దక్షిణపు వీధి సచివాలయం పరిధిలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటా ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ జలుబు, ముక్కు నుంచి నీరు కారుట, జ్వరం, తుమ్ములు, గొంతునొప్పి వంటి వైరస్ లక్షణాలు కావచ్చని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదనీ జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు.

నులి పురుగులను.. నులిమేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- ఎంపీడీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ
- ఆరోగ్య, విద్యాశాఖ సమన్వయంతో డీవార్మింగ్ డే



చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

నిడమర్రు/గణపవరం : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులిమేద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14న, మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ డీ వార్మింగ్ డే నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. శరీరంలోని పేగుల్లో చేరిన నులి పురుగులకు ఒక్క ఆల్బెండజోల్ మాత్రతో చెక్ పెట్టవచ్చని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంటున్నారు. పిల్లల్లో ఎక్కువగా నులి పురుగులు ఉంటాయి. నులి పురుగులను నివారించి చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా కార్యాచరణ రూపొందించారు.

నియోజకవర్గంలో 28 వేల మందికి

ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని 1నుంచి 19 ఏళ్ల వయస్సున్న బాలబాలికలు, యువతీ, యువకులకు కలిపి సుమారు 28 వేల మందికి ఆల్‌బెండజోల్ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు తెలిపారు. 1 నుంచి 2 ఏళ్ల పిల్లలకు సగం ఆల్బెండజోల్ మాత్ర (200మి. గ్రా) పొడిచేసి నీరు కలిపి ఇవ్వాలి. 2 నుంచి 19 ఏళ్ల వరకూ ఉన్నవారికి ఒక ఆల్బెండజోల్ మాత్ర (400 మి. గ్రా) చప్పరించి నమిలి నీటితోపాటు మింగాల్సి ఉంది. 5 నెలలు నిండిన గర్భిణులకు ఒక మాత్ర అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం అమల్లో ఆయా పాఠశాలలోని సిబ్బందిలో ఒకరిని గైడ్ టీచర్‌గా అవగాహన కల్పించి వారి భాగస్వామ్యంతో పంపిణీ జరిగేలా తగిన శిక్షణ ఆరోగ్య సిబ్బంది అందించారు.

నులి పురుగులు వ్యాపించే మార్గాలు

కలుషిత ఆహార పదార్థాలు, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళి పడిన పదార్థాలు తినడం వల్ల నోటి నుంచి పొట్ట, పేగుల్లోకి నులి పురుగులు చేరుతాయి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్లు వినియోగించడం ద్వారా శరీరంలోనికి నులి పురుగులు చేరుతాయి. 0ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, వంట సరకులు శుభ్రమైన నీటితో కడగకపోవడం, చేతి వేళ్ల గోళ్ల ద్వారా, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం, ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, ఆయా ప్రాంతాల్లో పిల్లలు ఆడుకోవడం అక్కడే ఉండే నులి పురుగులు, వాటి లార్వా జీర్ణకోశంలోకి ప్రవేశించడం వల్ల నులి పురుగులు వ్యాప్తి చెందుతాయి.

మాత్రకు దూరంగా ఉండాల్సిన వారు

అనారోగ్యంతో ఉన్నవారు కోలుకున్న తరువాతే ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలి. ఏడాది లోపు వయసున్న వారు, గర్భిణులు, బాలింతలు, కాలేయ వ్యాధిగ్రస్తులు, ఉదర సంబంధ కేన్సర్ ఉన్న వారు, పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ మాత్రలు వేసుకోరాదు.

నులి పురుగులతో కలిగే నష్టాలు

50నుంచి 60శాతం మంది నులిపురుగుల బారినపడి రక్తహీనతకు గురవుతున్నారు. నులి పురుగుల్లో ప్రధానంగా ఏలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులు అనే మూడురకాల వల్లనే ఎక్కువగా రక్తహీనతకు గురవుతున్నారు. నులిపురుగులు పేగుల్లోని రక్తాన్ని తాగి తమ సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. వాటివల్ల రక్తహీనత, నీరసం, కడపునొప్పితో పాటు విద్యార్థులు నిస్సత్తువ కారణంగా చదువులో ఏకాగ్రత కోల్పోతారు. దగ్గు, ఆయాసం రావచ్చు. బిడ్డ ఎదుగుదల తగ్గుతుంది. చర్మంపై ఎర్రని దద్దుర్లు రావచ్చు. బరువు తగ్గిపోతారు. తర చూ కడపునొప్పి వస్తుంది. వాంతులు, విరేచనాలు, మలంలో రక్తం పడటం, తలనొప్పి, ఆకలి తగ్గుతుంది.

తల్లిదండ్రుల సమక్షంలో పంపిణీ



12 నెలలు దాటిన శిశువు నుంచి మూడేళ్లలోపు చిన్నారులను వారి తల్లిదండ్రులు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలి. సిబ్బంది వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారించుకున్న తర్వాతే వారి సమక్షంలో మందు బిళ్లను నీటిలో కలిపి తాగించాలి. మండలంలో 6,666 మందికి మాత్రలు పంపించేందుకు 220 మంది సిబ్బందిని ఏర్పాటుచేసాం.

– డాక్టర్ కె. భాగ్యశ్రీ, మండల వైద్యాధికారి, నిడమర్రు

తగిన శిక్షణ తీసుకున్నాం



ఆల్బెండజోల్ మాత్రలు వినియోగంపై తగిన శిక్షణ తీసుకున్నాం. మంగళవారం విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత ప్రభుత్వం పంపిణీ చేసిన ఆల్బెండజోల్ మాత్రలు ఆయా తరగతుల టీచర్స్ సమక్షంలో పంపిణీ చేస్తాం. గొంతులో ఇరుక్కోకుండా మాత్రను విద్యార్థులు చప్పరించి మింగేలా పర్యవేక్షిస్తాం.

– పి. సౌజన్య, గైడ్ టీచర్, ఎంపీయూపీ స్కూల్

5,500 మందికి లక్ష్యం



గణపవరం మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో పాటు బయట ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. మండలంలో 5,500 మందికి మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నది లక్ష్యం.

– డా. సంతోష్‌నాయుడు, వైద్యాధికారి, గణపవరం పీహెచ్‌సీ

ఆర్థిక సాయం అందజేత



పోలసానిపల్లిలో ఆర్థిక సాయం అందజేస్తున్న రామిశెట్టి గంగాధరరావు

భీమడోలు: గ్రామానికి చెందిన కూన శివప్రసాద్ కొంత కాలంగా ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉమ్మడి జిల్లాల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావుతో పాటు ప్రతినిధులు పోలసానిపల్లిలోని శివప్రసాద్ సోదరుడు సురేష్‌కు రూ.5వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా అధ్యక్షుడు ఆర్.గంగాధరరావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల చైర్మన్ గుల్ల నూకరాజు, జిల్లా అడిట్ ప్రతినిధి జీఆర్ శంకర సభ్యులు దూడి రాజేష్, చిలపర్తి ఆదినారాయణ, వీరవల్లి ఏడుకొండలు, బాడాని పార్థసారధిరాజు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం



పెరుగ్గూడెంలో డ్రైనేజీ, రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ

దెందులూరు: పెరుగ్గూడెంలో రైతులకు, గ్రామస్తులకు శాశ్వతంగా ప్రయోజనం కలిగేలా రూ. 4 లక్షల సొంత నిధులతో సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ రోడ్డు, డ్రైనేజీని ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోని వాడకం నీరు బయటకు పంపే విధంగా తూరల్లో డ్రైనేజీని ఏర్పాటు చేసి మురుగుకుంటను రోడ్డుగా మార్చే పనులను సర్పంచ్ పూర్తి చేశారు. పనులను సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు యలమర్తి సత్తిబాబు, ఎంపీటీసీ యలమర్తి బాపూజీ ఉన్నారు.

అధిక ఉష్ణోగ్రతతో ప్రయాణికుల అవస్థ



ముందూరు- ఎంఆర్‌సీ కాలనీ రహదారి మధ్యలో విక్రయానికి సిద్ధంగా పుచ్చకాయలు



నిర్మానుష్యంగా పెదవేగి ప్రధాన రహదారి

పెదవేగి : ఆకస్మికంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో నియోజకవర్గంలోని ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ఎండ తీవ్రతకు పాఠశాలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి రాకముందే ఇలా ఎండలు ఉంటే మునుముందు ఎండల తీవ్రత ఇంకెలా ఉంటుందోనని ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఫిబ్రవరి నెల నుంచే ఎండలు మండుతుండటంతో ప్రయాణికులు కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, ముంజులు, జ్యూస్‌లు, చల్లని పానీయాలు తీసుకుంటూ సేదతీరుతున్నారు.

జిల్లాలో 40 డిగ్రీల చేరువులో ఎండ మంట

జిల్లాలో వేసవి రాకుండానే ఎండలు మండుతున్నాయి. మార్చి మొదటి వారంలో పగటి ఉష్ణోగ్రత అనేకచోట్ల 37 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. రాబోయే వారంరోజుల్లో జిల్లాలో ఎండవేడిమి మరింత పెరుగుతుందని ఇదే సమయంలో క్రమేపీ చలి వాతావరణం తగ్గుముఖం పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గడిచిన రెండు దశాబ్దాల్లో 2021 నాటి ఎండకాలం తీవ్రత చాలా ఎక్కువ. ఈ సంవత్సరం దానికి మించి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. చిత్తశుద్ధితో మొక్కల పెంపకం చేపట్టి, పచ్చదనం పెంచితే వేసవి అంతగా జనంపై ప్రతాపం చూపదని అధికారులు ఆ దిశగా పయనిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపట్టిన మొక్కల పెంపకాన్ని అధికారులు, పూర్తిస్థాయిలో అమలు చేసి ఓ ఉద్యమంలా కృషి చేస్తే తప్ప వేరే మార్గం లేదంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్



ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో కలిసి ఓటు వేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో కలిసి ఓటు వేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

పెదవేగి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెదవేగి నుంచి వంద శాతం పోలింగ్ నమోదైందని ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెదవేగి మండలం నుంచి 7 టీడీపీ ఎంపీటీసీలు, 18 వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీటీసీ పెనుమాల విజయ్‌బాబులు ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో వారి ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వాసుబాబు

గణపవరం: ఏలూరులో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. స్థానిక సంస్థల కోటాలో జిల్లాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. ఏలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వాసుబాబు తన ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులదే విజయం

దెందులూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల విజయం ఖాయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మండలంలోని 19 మంది ఎంపీటీసీలు ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీతో కలిసి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పోలింగ్ కేంద్రమైన ఏలూరు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దెందులూరు ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఓటు హక్కు వేసేందుకు గుర్తించామని వివరించారు.

ప్రజాప్రతినిధులకు ఓటింగ్‌పై అవగాహన

భీమడోలు: ఏలూరులో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సోమవారం మండలం నుంచి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు తరలి వెళ్లారు.వారంతా ప్రశాంత వాతావరణంలో ఉత్సాహంగా తమ ఓట్లు వేసారు. శాసన మండలి ఎన్నికలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్‌ను వైసీపీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులు వైసీపీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను కలిసి తమ అమూల్యమైన ఓట్లను వేసి అఖండ విజయాన్ని అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. మండలంలోని 20మంది ఎంపీటీసీలు, జెడ్పీటీసీల్లో ఒకరు మినహా మిగిలిన 19 మంది వైసీపీ ప్రజాప్రతినిధులు కావడంతో వారంతా వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి తమ విజయకేతనాన్ని చూపారు. తొలుత భీమడోలు మండలం నుంచి తరలి వెళ్లిన ప్రజాప్రతినిధులకు ఓటింగ్‌పై ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి వారికి అవగాహన కల్పించారు.

వ్యాయామ విద్యార్థులకు భోజనశాల నిర్మాణం

దెందులూరు: క్యాడ్బరీ సంస్థ గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థులకు భోజన శాల నిర్మించడం అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సత్తానియేలు అన్నారు. క్యాడ్బరీ సంస్థ వ్యాయామ కళాశాలలో సేవా కార్యక్రమాల్లో భాగంగా షెడ్డును పూర్తి సొకర్యాలతో నిర్మించారు. కళాశాలలో ప్రస్తుతం ఉన్న డైనింగ్ హాలు షెడ్డు శిథిలావస్థకు చేరడం, విద్యార్థుల పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ తెలియజేయడంతో ఈ నూతన షెడ్డు నిర్మాణం చేపట్టారు. దాతను ప్రిన్సిపల్ సత్తానియేల్, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ శ్యామల, విజయలక్ష్మి, రమేష్ అభినందించారు.

వాహనాల తనిఖీ

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై నియోజకవర్గంలో మూడు ప్రధాన రహదారులపై సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఏవీ నాంచారయ్య, దెందులూరు పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రహదారులు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

గణపవరం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు నులి పురుగుల నివారణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. మంగళవారం నుంచి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్‌ఎన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పెదవేగి : బాలికల్లో రక్తహీనత నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ చెప్పారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నులిపురుగుల దినోత్సవాన్ని వైద్య సిబ్బంది యుద్ధప్రాతిపదికన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన అన్నారు. మండలంలో ఉన్న అన్ని కళాశాలలకు, పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే సుమారు 17 వేల మాత్రలను మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేశామని చెప్పారు.

ఈ- క్రాప్ నమోదు పూర్తి



గణపవరంలో ఈ క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 25,447 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని మండల వ్యవసాయ అధి కారి బాలిన వెంకటేష్ వెల్లడించారు. ఈ రబీ సీజన్‌లో 25,447 ఎకరాల్లో ఈ పంట నమోదు చేసి ఈకేవైసీ 97 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఈనెల 10వ నుంచి ఆర్‌బీకేల వద్ద ప్రతి గ్రామ జాబితాలు వెల్లడిస్తామన్నారు. ఈనెల 14నుంచి 17 వరకు సామాజిక తనిఖీకోసం గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. రైతులకు అభ్యంతరాలుంటే ఆర్‌బీకేలోని వీఏఏ, వీహెచ్ఏలను కలుసుకుని సరి చేయించుకోవాలని ఆయన సూచించారు. 2023లో సీజన్‌లో ఆఖరి అవకాశంగా పరిగణించాలని తెలిపారు.

ఆర్‌బీకేల వద్ద ఈ క్రాప్ ముసాయిదా జాబితా

భీమడోలు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద రబీ 2022–23 సీజన్‌కు ఈ క్రాప్ ముసాయిదా జాబితాలను ప్రదర్శించినట్లు మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. భీమడోలులో ఆమె సోమవారం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో 13,401 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు 96 శాతం పూర్తి చేశామన్నారు. గత సీజన్ కన్నా 3శాతం ఎక్కువన్నారు. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు సామాజిక తనిఖీలు, గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద ఈ క్రాప్ నమోదైన రైతుల వివరాలను పొందుపర్చామన్నారు. ఈ గ్రామ సభల్లో రైతుల వివరాలను ఆర్‌బీకే సిబ్బంది తెలియజేస్తారన్నారు. రైతులు ఈ ముసాయిదా జాబితాల్లోని పేర్లను పరిశీలించుకోవాలన్నారు. ఎటువంటి అభ్యంతరాలున్నా వాటి వివరాలను ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి రాతపూర్వకంగా అందజేస్తే సవరణ చేస్తామన్నారు. తుది జాబితాను ప్రదర్శించిన తర్వాత ఎటువంటి మార్పులు, సవరణలు చేయబోమని ఏవో తెలిపారు.

పంట నమోదుతో గిట్టుబాటు ధర

పెదవేగి : పంట నమోదు వల్ల రైతులు తమ ఉత్పత్తిని ప్రభుత్వం వారు అందించే గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వై రామకృష్ణ అన్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంలో ఈ పంట సోషల్ ఆడిట్ గ్రామసభ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వై రామకృష్ణ , రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన పంట నమోదు జాబితాను పరిశీలించారు. సోషల్ ఆడిట్ గ్రామ సభలో వచ్చిన అభ్యర్థనలను పరిశీలించి మార్పులు చేయాలని సిబ్బందికి తెలియజేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పంట నమోదు వల్ల రైతులు తమ ఉత్పత్తిని ప్రభుత్వం వారు అందించే గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. విపత్తు సమయంలో ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం పొందవచ్చని, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి అర్హత పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారిణి ఎం ప్రియాంక, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు భోగాపురం అంకన్నగూడెం దుగ్గిరాల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించారు

ఈ క్రాప్ సవరణకు దరఖాస్తుల స్వీకరణ

గణపవరం: మండలంలో 2022–23 సీజన్‌లో 11,780 ఎకరాల్లో ఈక్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. రబీలో ఈక్రాప్ నమోదుకు తుదిగడువు తొలుత ఫిబ్రవరి 10వ తేదీగా ప్రకటించినా, తరువాత మార్చి 4వ తేదీ వరకూ పొడిగించారని తెలిపారు. మండలంలో మొత్తం 99.85 శాతం ఈక్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద మార్చి 10న ఈక్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ జాబితాలను ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకూ సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రదర్శనకు ఉంచుతున్నామని, గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఆర్‌బీకే సిబ్బంది ఈక్రాప్ జాబితాలో ఉన్న వారి పేర్లు చదివి వినిపిస్తారని, జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు, సవరణలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఈ సీజనుకు సంబంధించి ఇదే చివరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు చేయలేమని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.